నమస్తే తెలంగాణ
మెదక్
I | హైదరాబాద్, శుక్రవారం 28 ఫిబ్రవరి 2025 | MEDAK

సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పోలింగ్ తీరును పరిశీలిస్తున్న కలెక్టర్ మనుచౌదరి

ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

- పోలింగ్ సరళిని పరిశీలించిన ఎన్నికల పరిశీలకుడు జ్యోతి బుద్ధప్రకాశ్

సిద్దిపేట, ఫిబ్రవరి 27: సిద్దిపేట జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ గురువారం ప్రశాంతంగా ముగిసింది. ఉమ్మడి మెదక్-ని జామాబాద్-కరీంనగర్-ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ జరిగింది. సిద్దిపేట పట్టణంలో కలెక్టర్ మనుచౌదరితో కలసి పోలింగ్ కేంద్రాన్ని ఎన్నికల పరిశీలకుడు జ్యోతి బుద్ధప్రకాశ్ సందర్శించి పోలింగ్ సరళిపై ఆరా తీశారు. కలెక్టర్ మనుచౌదరి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ఓటింగ్ సరళిని పరిశీలించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పోలింగ్ సజావుగా ముగిసిందని కలెక్టర్ తెలిపారు. కేంద్రాల వద్ద తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, ర్యాంపులు, లైటింగ్, మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో పట్టభద్రుల స్థానానికి 40 పోలింగ్ కేంద్రాలు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు 23 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పరిధిలోని కొమురవెల్లి, చేర్యాల ధూళిమిట్ట, మద్దూరు మండలాల్లో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో సజావుగా పోలింగ్ జరిగినట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల, కళాశాలలోని ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ కేంద్రాల వద్ద బందోబస్తును సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ పరిశీలించారు. మొత్తం 419 మంది పోలీస్ సిబ్బందితో పటిష్ట బందోబస్తు మధ్య పోలింగ్ సజావుగా నిర్వహించినట్లు సీపీ తెలిపారు.

సిద్దిపేట జిల్లాలో భారీగా నమోదు

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సిద్దిపేట జిల్లాలో 94.83శాతం నమోదైంది. జిల్లాలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లు 3,212 మంది ఉండగా, ఇందులో 3,046మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 1,925 మంది, మహిళలు 1,121మంది ఉన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌లో జిల్లాలో 72.83శాతం పోలింగ్ అయింది. జిల్లాలో 32,589మంది ఓటర్లు ఉండగా 23,736మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో పురుషులు 16,143 మంది, మహిళలు 7,593 మంది ఓట్లు వేశారు. వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు సంబంధించి సిద్దిపేట జిల్లాలోని చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాలకు చెందిన ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 166మంది ఓటర్లు ఉండగా 156మంది ఓటు వేశారు. మొత్తంగా ఇక్కడ 93.97శాతం పోలింగ్ నమోదైంది.

సిద్దిపేట పోలింగ్ కేంద్రంలో బందోబస్తును పర్యవేక్షిస్తున్న సీపీ అనురాధ

మెదక్ జిల్లాలో ఉత్సాహంగా

- టీచర్స్ ఎన్నికల్లో 95.03 శాతం పోలింగ్ నమోదు
- గ్రాడ్యుయేట్ స్థానంలో 75.26 శాతం నమోదు
- టీచర్ స్థానంలో 1250 ఓట్లు పోల్, గ్రాడ్యుయేట్ స్థానంలో 9387 ఓట్లు పోల్
- పోలింగ్ సరళి, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

మెదక్‌లో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఫిబ్రవరి 27 (నమస్తే తెలంగాణ) : పూర్వ మెదక్, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ టీచర్, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు పోలింగ్ గురువారం మెదక్ జిల్లాలో ప్రశాంతంగా సాగింది. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మెదక్ జిల్లాలో గ్రాడ్యుయేట్ ఎన్నికల పోలింగ్‌కు 22 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 21 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 వరకు పోలింగ్ కొనసాగింది. ఉదయం 10 గంటల వరకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల నియోజకవర్గానికి 8.19 శాతం, ఉపాధ్యాయ నియోజకవర్గానికి 16.41 శాతం పోలింగ్ నమోదైంది. మధ్యాహ్నం 12 గంటల వరకు టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 50.04 శాతం పోలింగ్ నమోదు కాగా, గ్రాడ్యుయేట్ స్థానానికి 24.62 శాతం నమోదైంది. మధ్యాహ్నం 2గంటల వరకు టీచర్స్ స్థానానికి 77.58 శాతం పోలింగ్ కాగా, గ్రాడ్యుయేట్ స్థానానికి 43.50 శాతం పోలింగ్ నమోదైంది. సాయంత్రం 4గంటల వరకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 95.03 శాతం పోలింగ్ నమోదు కాగా, గ్రాడ్యుయేట్ స్థానానికి 75.26 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు. టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి 1347 ఓట్లు కాగా, 1250 ఓట్లు పోలయ్యాయి. గ్రాడ్యుయేట్ స్థానానికి 12,472 ఓట్లు కాగా, 9387 ఓట్లు పోలయ్యాయని అధికారులు తెలిపారు.

పోలింగ్ సరళిని పరిశీలించిన కలెక్టర్...

మెదక్‌లోని ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల పోలింగ్ కేంద్రాన్ని గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్ సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రాడ్యుయేట్, టీచర్స్ స్థానాలకు జిల్లాలో మొత్తం 43 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఎక్కడా ఓటర్లకు అసౌకర్యం కలగలేదని చెప్పారు. పోలింగ్ ప్రశాంతంగా ముగిసినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2గంటల వరకు గ్రాడ్యుయేట్ స్థానానికి 43 శాతం పోలింగ్ నమోదు కాగా, టీచర్స్ స్థానానికి 77 శాతం పోలింగ్ నమోదైనట్లు తెలిపారు. పట్టభద్రుల ఓటర్లు జిల్లాలో ఎక్కువ ఉన్నందువల్ల 4.00 వరకు పోలింగ్ కేంద్రం లోపల ఉన్న వారికి ఓటు వేయడానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం నిర్దేశించిన రూట్ మ్యాప్ ద్వారా కరీంనగర్ రిసెప్షన్ సెంటర్‌కు బ్యాలెట్ బాక్స్‌లను తీసుకువెళ్లాలని అధికారులకు కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ లక్ష్మణ్ బాబు, సంబంధిత సిబ్బంది ఉన్నారు.

మెదక్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బారులుదీరిన ఓటర్లు


నారాయణఖేడ్ ప్రభుత్వ పాఠశాలలో బారులుదీరిన ఓటర్లు


శివ్వంపేట: మెదక్ జిల్లా శివ్వంపేటలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకుని సిరాచుక్క చూపుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

ఓటెత్తారు

- ఉత్సాహంగా ఓటేసిన గ్రాడ్యుయేట్లు, టీచర్లు
- సంగారెడ్డి జిల్లాలో టీచర్స్ ఎమ్మెల్సీ ఓటింగ్ శాతం 92.57
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఓటింగ్ శాతం 73.19 శాతం
- పోలింగ్ కేంద్రాలను సందర్శించిన కలెక్టర్ క్రాంతి

ప్రశాంతంగా ముగిసిన ఎమ్మెల్సీ ఎన్నికలు

సంగారెడ్డి, ఫిబ్రవరి 27(నమస్తే తెలంగాణ): సంగారెడ్డి జిల్లాలో గురువారం గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. జిల్లాలో మొత్తం 68 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గతంలో కంటే ఎక్కువగా టీచర్లు, పట్టభద్రులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 92.57శాతం, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి 73.19 శాతం పోలింగ్ నమోదైంది. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను కట్టుదిట్టమైన భద్రత నడుమ కరీంనగర్ తరలించారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఉదయం సంగారెడ్డి తారా కాలేజీలోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఆ తర్వాత చౌటకూరులోని పోలింగ్ కేంద్రాన్ని సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులు అంజిరెడ్డి, అశోక్‌కుమార్‌తో పాటు పలువురు అభ్యర్థులు ఓటు హక్కును వినియోగించుకున్నారు. బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి రామచంద్రాపురంలో ఓటు హక్కు వినియోగించుకున్నారు.అందోలు మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ వట్‌పల్లిలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

మందకొడిగా ప్రారంభమై...

గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంగారెడ్డి జిల్లాలో పోలింగ్ మందకొడిగా ప్రారంభమైంది. మధ్యాహ్నం 12 గంటల తర్వాత ఊపందుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం 5.30 గంటల వరకు గ్రాడ్యుయేట్లు, టీచర్స్ క్యూలో ఉన్నారు. 4గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో ఉన్న టీచర్లు, గ్రాడ్యుయేట్లు ఓటు వేసే వరకు పోలింగ్ కొనసాగింది. సంగారెడ్డి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు మొత్తం 25652 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 2690 ఉన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం గ్రాడ్యుయేట్ ఓటర్ల కోసం 40, టీచర్ ఓటర్ల కోసం 20 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉదయం 10 గంటలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 8.5 శాతం, టీచర్స్ నియోజకవర్గానికి 12.94 శాతం ఓటింగ్ నమోదైంది. 12 గంటలకు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 24.50 శాతం, టీచర్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గానికి 39.93 శాతం ఓటింగ్ జరిగింది. మధ్యాహ్నం 2గంటలకు టీచర్స్ నియోజకవర్గానికి 68.25 శాతం, పట్టభద్రుల నియోజకవర్గానికి 45.88 శాతం ఓటింగ్ నమోదైంది. సాయంత్రం 4గంటలకు టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 85.69, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 66.47 శాతం పోలింగ్ జరిగింది. పోలింగ్ ముగిసిన తర్వాత టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి 93.57 శాతం, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి 73.10 శాతం పోలింగ్ నమోదైంది.


మెదక్‌లో ఓటుహక్కు వినియోగించుకోవడానికి బారులుదీరిన పట్టభద్రులు

గ్రాడ్యుయేట్ ఓటర్ల పోలింగ్ ...

డివిజన్	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
సంగారెడ్డి	15094	11058	73.26
అందోలు	2437	1854	76.08
నారాయణఖేడ్	3577	2533	70.81
జహీరాబాద్	4544	3329	73.26
మొత్తం	25652	18774	73.19

టీచర్స్ ఓటర్ల పోలింగ్ ఇలా...

డివిజన్	ఓటర్లు	పోలైన ఓట్లు	శాతం
సంగారెడ్డి	1621	1480	91.30
అందోలు	185	170	91.89
నారాయణఖేడ్	375	358	95.47
జహీరాబాద్	509	482	94.70
మొత్తం	2690	2490	92.57

పటాన్‌చెరులో ఓటు హక్కు వినియోగించుకోవడానికి క్యూలో ఉన్న పట్టభద్రులు

సంగారెడ్డి డివిజన్‌లో అత్యధికంగా ఓటు వేసిన ఓటర్లు

ఎమ్మెల్సీ ఎన్నికల్లో సంగారెడ్డి డివిజన్‌లో చెందిన గ్రాడ్యుయేట్లు, టీచర్లు ఎక్కువ సంఖ్యలో ఓట్లు వేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ స్థానానికి సంబంధించి జిల్లాలో 2690 ఓట్లు ఉండగా 2490 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డిలో అత్యధికంగా 1480 మంది ఓటు వేశారు. అలాగే అందోలు డివిజన్‌లో 170, నారాయణఖేడ్‌లో 358, జహీరాబాద్‌లో 482 మంది ఓటు వేశారు. జిల్లాలో 25,652 మంది గ్రాడ్యుయేట్ ఓటర్లు ఉండగా, 18774 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. సంగారెడ్డి డివిజన్‌లో 11,058 మంది, అందోల్‌లో 1854, నారాయణఖేడ్‌లో 2533, జహీరాబాద్‌లో 3329 మంది గ్రాడ్యుయేట్లు ఓట్లు వేశారు.

తెలంగాణను విస్మరిస్తున్న కేంద్రం

- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: తెలంగాణలో ప్రాజెక్టులను పూర్తి చేయడం, విభజన హామీలు నెరవేర్చడం కేంద్ర ప్రభుత్వానిదే బాధ్యత అని, ఈ విషయంలో కేంద్రం తీరు బాగాలేదని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కేంద్రం నుంచి వచ్చే నిధులు , ఇతర పథకాలకు సంబంధించిన పనులు తేవడంలో తెలంగాణకు చెందిన కేంద్ర మంత్రులు పూర్తిగా విఫలమయ్యారని ఆయన విమర్శించారు. ఇన్నాళ్లు బీఆర్ఎస్ పార్టీ సాకు చూపి పదేండ్ల పాటు పబ్బం గడిపారని, ఇప్పుడు కేంద్రం చుట్టూ తాము తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని అన్నారు. గురువారం సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక పోలింగ్‌లో ఓటు వేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేండ్ల పాటు బీఆర్ఎస్ సీఎం , మంత్రులు అడగడ లేదని, అడిగితే అన్నీ ఇచ్చేవాళ్లమని చెప్పిన కేంద్ర మంత్రులు, ఇప్పుడు కేంద్రం చుట్టూ కాలికి బట్టకట్టుకొని సీఎం రేవంత్ తిరుగుతున్నా పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రం నుంచి ఏ ప్రాజెక్టు రాకున్నా కేంద్ర మంత్రులదే బాధ్యత అని, కిషన్‌రెడ్డి ఉట్టి మాటలు చెప్పడం కాకుండా ప్రాజెక్టుల మంజూరుకు కృషి చేయాలని హితవు పలికారు. తెలంగాణ నుంచి జీఎస్టీ, పన్నుల రూపంలో చెల్లింపులు చేస్తే తిరిగి అభివృద్ధి నిధులు ఇవ్వడంలో బీజేపీ సర్కారు నిర్లక్ష్యం చేస్తున్నదని మంత్రి మండిపడ్డారు. కులగణనకు అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని, ఈబీసీ కోసం షెడ్యూల్‌లో చేర్చినట్లే బీసీల రిజర్వేషన్‌ను రాజ్యాంగం షెడ్యూల్‌లో చేర్చి చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కేంద్రంపై ఉందన్నారు. లేకుంటే రాష్ట్ర ప్రజలు రాబోయే రోజుల్లో బీజేపీ నాయకులకు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, సింగిల్‌విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య పాల్గొన్నారు.

ఒకరి ఓటు మరొకరితో వేయించిన అధికారులు

తన ఓటు వేరే వాళ్లు వేశారని చెబుతున్న భూక్య కవిత

హుస్నాబాద్, ఫిబ్రవరి 27: హుస్నాబాద్‌లోని పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రం రూమ్ నంబర్ 1లో ఓటు ఉల్టా పల్టా అయ్యింది. హుస్నాబాద్ మండలం పూల్‌నాయక్ తండాకు చెందిన భూక్య కవిత ఓటు వేసేందుకు గురువారం హుస్నాబాద్‌లోని పోలింగ్ కేంద్రానికి వచ్చింది. లోపలికి వెళ్లిన కవితకు నీవు ఇప్పటికే ఓటు వేశావు, మళ్లీ ఎందుకు వచ్చావని అధికారులు ఆమెను ప్రశ్నించారు. తాను ఓటు వేయలేదని, ఇప్పుడే పోలింగ్ కేంద్రానికి వచ్చానని ఆమె చెప్పడంతో అధికారులు అయోమయంలో పడ్డారు. జాబితాలో వెతకగా బోడ కవిత అనే ఇంకో మహిళ భూక్య కవిత పేరున ఓటు వేసింది. దీనిని సరిదిద్దేందుకు బోడ కవిత పేరున భూక్య కవితతో ఓటు వేయించారు. అధికారులు గుర్తింపు కార్డులను సరిగ్గా పరిశీలించక పోవడంతోనే ఈ పొరపాటు జరిగినట్లు ఇతర అధికారులు తెలిపారు. ఓటు ఉల్టా పల్టా అయి ఒకరి ఓటు ఇంకొకరు వేయడంతో పోలింగ్ కేంద్రంలో చర్చనీయాంశమైంది.

డంపుయార్డుతో బతుకులు నాశనం

- గుమ్మడిదలలో 17వ రోజు రిలే దీక్ష చేపట్టిన పాస్టర్స్
- నల్లవల్లిలో 23వ రోజు రిలే దీక్షలో కూర్చున్న వృద్ధులు
- ఎమ్మెల్సీ ఎన్నికల బహిష్కరణ

ప్రభుత్వం వెంటనే స్పందించాలి.. ఏర్పాటును విరమించుకోవాలి: రైతు జేఏసీ నాయకుల డిమాండ్

గుమ్మడిదలలో డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా రిలే నిరాహార దీక్ష చేపట్టిన చర్చిల పాస్టర్లు

గుమ్మడిదల, ఫిబ్రవరి 27: డంపుయార్డు ఏర్పాటు చేసి తమ బతుకులు నాశనం చేయవద్దంటూ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం గుమ్మడిదలలో రైతు జేఏసీ అధ్యక్షుడు చిమ్ముల జైపాల్‌రెడి అధ్యక్షతన 23వ రోజు రిలే నిరాహార దీక్ష కొనసాగింది. దీక్షలో మండలంలోని చర్చిల పాస్టర్లు పాల్గొని డంపింగ్‌యార్డుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రూ.5 వేలు విరాళం అందజేశారు. నల్లవల్లి 23వ రోజు వృద్ధులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. కొత్తపల్లిలో 23 రిలే నిరాహార దీక్షలో యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గుమ్మడిదలలో పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దినకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం డంపుయార్డు ఏర్పాటును వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. డంపుయార్డు ఏర్పాటుతో ఈ ప్రాంతం అన్నివిధాలుగా నష్టపోతుందని తెలిపారు. నల్లవల్లిలో బుధవారం రాత్రి మహాశివరాత్రి జాగారంలో భాగంగా రిలే నిరాహార దీక్ష శిబిరంలో జవహర్ నగర్ డంపింగ్‌యార్డు వల్ల అక్కడి ప్రజలు పడుతున్న బాధలు, అనారోగ్య సమస్యలు, పర్యావరణం, భూగర్భజలాలు కలుషితం గురించి ప్రొజెక్టర్ ద్వారా స్థానికులు తెలుసుకున్నారు. 23వ రోజు రిలే నిరాహార దీక్షలో వృద్ధులు పాల్గొన్నారు. దీక్షలో పాస్టర్స్ మత్యుకుటు, పద్యారావు, పాల్‌సన్, జాన్ పాల్, వరప్రసాద్ స్టీవెల్, సామ్యూల్‌పాల్, మాజీ జడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచ్ చిమ్ముల నర్సింహారెడ్డి, జేఏసీ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, పుట్టనర్సింగ్‌రావు, నరేందర్‌రెడ్డి, మద్దుల బాల్‌రెడ్డి, సదానందరెడ్డి, మోహన్ రెడ్డి, కాలకంటి రవీందర్‌రెడ్డి, ఉదయ్‌కుమార్, బాల్‌రెడ్డి, స్వేచ్చారెడ్డి, ఆలేటి శ్రీనివాస్ రెడ్డి,ప్రతాప్‌రెడ్డి, వీరారెడ్డి, సంజీవరెడ్డి, లక్ష్మారెడ్డి, దేవేందర్‌రెడ్డి, నాగేందర్‌గౌడ్, జయశంకర్‌గౌడ్, ప్రవీణ్‌రెడ్డి, మల్లేశ్‌గౌడ్, బాలు, తుడుం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు దూరం...

డంపింగ్‌యార్డు ఏర్పాటుకు వ్యతిరేకంగా గుమ్మడిదల మండలంలో పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు స్వచ్ఛందంగా దూరంగా ఉన్నారు. గుమ్మడిదలలో ఏర్పాటు చేసిన పోలింగ్‌స్టేషన్ నంబర్ 425లో పట్టభద్ర ఓటర్లు 295 మంది ఉన్నారు. వీరిలో కేవలం నాన్‌లోకల్ పట్టభద్రుల ఓటర్లు 42 మంత్రి ఓటు వేశారు. మిగిలిన 253 మంది స్థానిక పట్టభద్రులు ఓటు వేయకుండా ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. మూడు రోజుల క్రితం డంపింగ్‌యార్డు వ్యతిరేక జేఏసీ, పట్టభద్రులు సమావేశమై ఎమ్మెల్సీ ఎన్నికలకు దూరంగా ఉండాలని తీర్మానం చేశారు. గుమ్మిడిదల మండలంలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్లు 19 ఉండగా, 18 పోలయ్యాయి.

గుమ్మడిదల మండలం నల్లవల్లిలో 23వ రోజు రిలే నిరాహార దీక్షలో కూర్చున్న మహిళలు

డంపింగ్ యార్డు ఏర్పాటు వద్దంటూ కొత్తపల్లిలో 23వ రోజు రిలే దీక్ష చేపట్టిన యువకులు

పట్నం..పరవశం

- నయనానందకరంగా మల్లన్న పెద్దపట్నం
- బండారుమయంగా మారిన కొమురవెల్లి క్షేత్రం
- 50 వేల మంది భక్తుల దర్శనం

ఒగ్గు పూజారులు తయారు చేసిన పెద్దపట్నం (ఇన్‌సెట్లో స్వామివారి మూలవిరాట్)

చేర్యాల, ఫిబ్రవరి 27: సిద్దిపేట జిల్లా కొమురవెల్లి మల్లికార్జున స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో ముఖ్యమైన ఘట్టాల్లో ఒక్కటైన పెద్దపట్నం బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. మహాశివరాత్రి సందర్భంగా బుధవారం రాత్రి జాగరణ చేసిన భక్తులు, బలిజ మేడలమ్మ, గొల్లకేతమ్మలతో కొలువైన మల్లికార్జున స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గుట్టపైన ఉన్న ఎల్లమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. ఒగ్గు పూజారుల నేతృత్వంలో పెద్దపట్నం కార్యక్రమాన్ని నిర్వహించారు. పంచరంగులతో తయారుచేసిన పట్నం వద్ద ఒగ్గు పూజారులు జానపద పాటలు పాడుతూ, స్వామిని స్తుతిస్తూ పెద్దపట్నం నిర్వహించారు. ఒగ్గు పూజారుల సంఘం అధ్యక్షుడు బొడ్డుల కనకయ్య నేతృత్వంలో 159 మంది ఒగ్గు పూజారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. లింగోద్భవ కాలం రాత్రి 12గంటలకు మల్లికార్జున స్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ఆలయ అర్చకులు రాజగోపురం, రాతిగీరలు తదితర ప్రాంతాల్లో ఊరేగించి తిరిగి ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం ఒగ్గు పూజారులు రాత్రి 12గంటల తర్వాత పంచరంగులతో 42 వరుసలతో పట్నం తయారు చేశారు. అనంతరం స్వామి వారికి బోనం నివేదనగా చెల్లించగానే, ఆలయ అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను తీసుకువచ్చి వేకువజామున పెద్దపట్నం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దానిని దాటారు. ఆ తర్వాత భక్తులు పెద్దపట్నం దాటి ఆలయంలో మల్లన్న స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కొంతమంది భక్తులు పట్నం తొక్కేందుకు బారికేడ్లను సైతం లెక్కచేయకుండా దూకడంతో రద్దీని నియంత్రించేందుకు పోలీసులు భక్తులపై లాఠీలు ఝుళిపించారు. 50వేలకు మందికి పైగా భక్తులు క్షేత్రానికి వచ్చారు. ఆలయ ఈవో రామాంజనేయులు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, ఏఈవో బుద్ది శ్రీనివాస్, సూపరింటెండెంట్లు శ్రీరాములు, సురేందర్, ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, అర్చకులు, ఒగ్గు పూజారులు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, కొమురవెల్లి ఎస్సై రాజు ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

భక్తుల సందడి